# సరోజినీ దేవి రోడ్ మీదుగా బస్సు సంగీత్ వైపు పరుగెదుతోంది.

# బస్సు నిండా జనం...

# కాకపోతే అది మన బస్సెలా అవుతుంది? మనది ఆర్థికంగా వెనకబడిన దేశమెలా అవుతుంది!

# ఆర్థిక విధానం గారడీ ఆటగా మారితే ఆర్థికంగా వెనకబడిన దేశాలు ఎన్నితరాలైనా అలా వెనకబడే వుంటాయి.



సడన్ బ్రేకులు... కుదుపులు... చేతి గాజులు బంగారువి కనుక సరిపోయింది. ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం. ఇరుకు... గతుకులు... సజీవ నదుల్లా పారే డ్రైనేజీ నీళ్లు...

'రోడ్డా... రోడ్డా ఇట్లెందుకున్నావు?' అని ప్రశ్నిస్తూ పోతే పత్రికలకు బోల్డు సరుకు దొరుకుతుంది.

బస్సు కదిలింది.

కాని... అకస్మాత్తుగా బస్సులోని వాతావరణం మారిపోయింది.

"మారో..."

"సాలేకు మారో..."

ఒకటా రెండా.... ఎడా పెడా తలా ఒక దెబ్బ వేస్తున్నారు ఆ మాసిన తల మీద.

ఒళ్లు జలదరించింది.

పవిట చెంగుతో నుదురు, మెడ తుడుచుకొని... తిరిగి భుజాల చుట్టూ పవిట వేసుకున్నాను. మెళ్లోని గొలుసు భద్రంగా వుంది.

ఆ దెబ్బలు తింటున్న అతని అర చేతికి కట్టు ఏ చాకు కోసిందో... కోసుకుందో!

మాసిపోయినా ఇస్త్రీ మడత మాత్రం స్ట్రాంగ్‌గా కనిపించే షర్ట్. ఓ ముతక పాంటు... అదీ అతని ఆకారం. దొంగాడంటే ఇంతేనా!... మెడకు దస్తీ బుగ్గ మీద పావలా కాసంత మచ్చ లాంటి సినిమా వేషాలేం లేవు!

"తన్నండి... దొంగ లంజ్డి కొడుకుని..."

ఓ బూటు కాలు అప్పటికే ఆ పని చేసింది.

"క్యా హువా భాయ్?"

"అరే నా పర్స్ తీస్తాండె జెరంతయితే!"

"బాస్టర్డ్‌ని తన్నండి..."

సీటు నుంచి ఏకంగా ఎగిరి వొచ్చింది ఓ ఆకారం.

ఖచ్చితంగా అది భార్యను హింసించే శాల్తీయే... ఎదురు తిరగని శరీరం మీద దెబ్బ వేయటానికి ఎంత వుత్సాహమో...

ఆ మాసిన తల అతని మూతి మీద, గుండెల మీద పిడి గుద్దులు పడ్డాయి.

"మొన్న నా పాకీట్ను గిట్లనే ఎవ్వడో కొట్టేసిండు..."

'రోజూ కొట్టేస్తున్నారు భాయ్... నీకు తెలీటంలా!...' అనుకున్నాను

"అయితే పాకీటు తీసినాడు!..."

"ఆ... జెరంతయితె తీసునటు. గాయినె వుషారుగ వుండబట్కె ఇదయింది..."

"పాడవుండ్లి దొంగ నా కొడుకుని..."

కుర్రాళ్లు మరీ రెచ్చిపోయారు. ఓర చూపులు వాళ్ళను హీరోల్ని చేశాయి... కరాటే సీన్లలోకి దిగారు.

అతడు వృత్తికి బొత్తిగా కొత్తవాడిలా వుంది. తేలిగ్గా దొరికిపోయాడు.

బాక్సింగ్ నేర్చుకునేందుకు ఓ వేల్లాడే బస్తాను వాడతారే... అలా వుంది అతని పరిస్థితి.

"కష్టం జేసుకుని బతుకాలె... మంది సొమ్ముకు ఆశ పడ్తావురా!..."

ఓటు హక్కున్న ఓ తల్లి హితవు అది!

"పొకెట్లు కొడ్తవు బే..."

నాలుగైదు సీట్ల అవతల్నించి ఓ పాన్ మసాలా నోరు మనిషి వొచ్చి ఎగిరెగిరి అతన్ని కొడుతున్నాడు.

నా పక్కన కూర్చున్న కళ్లజోడు అమ్మాయి... డ్రైవర్‌తో బాతాఖాని కొడ్తూ దారి కడ్డంగా నుంచున్న పోకిరీ, రిజర్వ్డ్ సీట్ల వైపు తోసుకొని వచ్చిన వడి వయసు నరసుడు... అందరూ అతని వంక ఆగ్రహంగా చూస్తున్నారు. పోకిరీ శాల్తీ ఎద్దులా రంకెలు వేస్తూ అతని మీది మీదికి వెళ్ళాడు. ఇక తన ప్రతాపం చూపించసాగాడు.

ఒక్కసారిగా బస్సులో ఎందరు హీరోలో!!

"ఏయ్ డ్రైవర్ బస్సు ఆపు..." అని ఒకరు-

"పోనీ పోనీ... పోలీస్ స్టేషన్ దగ్గర ఆపు..." అని ఒకరు డ్రైవర్‌కు హుకుంలు జారీ చేస్తున్నారు.


అప్పటిదాకా బస్సు కిటికీల్లోంచి బయటికి గెంతిన చూపులన్నీ ఆ మాసిన తల మీద నిలిచిపోయాయి.

మొహం మీద పడే దెబ్బలకు అతడు మోచేతులు అడ్డం పెట్టుకున్నాడు.

తలా ఒక దెబ్బ వేస్తుంటే తల వొంచాడు. వీపును అప్పగించాడే కాని 'దొంగను కాను' అని బుకాయించ లేదు.. ఆ విషయంలో ఫలాని ఫలాని వాళ్ళకంటె అతడే గొప్ప...

ఓ రింగుల జుట్టాయన అతని కాలరు పట్టుకుని దవడ మీద ఈడ్చి కొట్టాడు. కడుపులో పొడిచాడు... అతడు బాధతో మెలికలు తిరిగిపోతున్నాడు.

5-7-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక




ఆ దృశ్యం చూడలేక తల తిప్పేసుకొని కిటికీ లోంచి బయటికి చూడసాగాను.

బస్సు పండ్ల దుకాణం దాటుతోంది.

ఎన్ని పళ్లో...

రకరకాల పళ్లు...

కొన్నిటి మీద ఈగలు విస్తళ్లు వేసుకున్నాయి.

జబ్బు పడేది జనమే కదా! ఆ తూకాల్లో ఎన్ని అవకతవకలో ఎందరం గమనిస్తున్నాం?...

"పిలెగాడు చూడబోతె ఎట్లున్నదు..."

"అమాయకుని లెక్కనె వున్నదు..."

కాబట్టే దొరికిపోయాడు బ్రదర్!

అతడు బక్క పలుచగా... ఎరుపు లేని కాడలా వున్నాడు. కండలు వుండడానికి గూండా కాదు.

గూండా అయితే బస్సుల్లో తిరిగే ఖర్మనా! ఎందరికో కావలసిన వాడై కారులోనూ, జీపులోనూ తిరిగేవాడు.

"డ్రైవర్... బస్... రోకో..."

ఒక్క కుదుపుతో బస్సు ఆగింది.

"ఈడ ఎందుకు ఆపినవ్ భై... పోనీ పోలీస్ టేషన్ కాడ ఆపు..."

ఆజ్ఞలు జారీ చేస్తున్నారు దొరలు.

బస్సు కదిలింది.

బస్సులో బీభత్సం తగ్గలేదు.

తిట్ల హోరు... దెబ్బలు...

చేతగాక దొరికిపోయిన దొంగంటే ఎంత లోకువ! ఆడ మగ... అమ్మాయిలూ, అబ్బాయిలూ అంతా అతని వంక వింతగా చూస్తున్నారు. చూపుల్తో శపిస్తున్నారు.

అందంగా తీర్చిదిద్దినట్లున్న చర్చి భవనం ముందు బస్సు సడన్ బ్రేక్‌తో ఆగింది.

ఒకే దూరానికి వేరు వేరు ఛార్జీలు చూపే మీటర్లు...

ఆపైన 'దో రూపై బడ్‌కే దేనా..."

రోడ్ల మీద ఆటోలకు ఎంత స్వతంత్రమో!

బస్సును ఆపేశాయి.

ఆ మాసిన తల అతను పారిపోకుండా గట్టిగా పట్టుకున్నారు. పోలీసులకు అప్పగిస్తారట!

ఎప్పుడు తిన్న అన్నమో... పొంటు జారిపోతున్నది. పెదవి చిట్లి రక్తం కారుతోంది.

బస్సు కదిలింది.

ఎత్తైన ప్రహరీగోడ... మహిళా కళాశాల.

సంగీత్ థియేటర్...

ట్రాఫిక్ రెడ్ సిగ్నల్...

మరోసారి బస్సు ఆగింది.

పెద్ద పెద్ద పోస్టర్లు... మగవాళ్ళ బలహీనతల్ని క్యాష్ చేసుకునే పోస్టర్లు...

'ఎ' గుర్తు ఇంగ్లీషు పోస్టర్! అక్కడ సినిమా ఒక బహిరంగ వ్యభిచారం...

అదో రకం దోపిడీ!

గోడల మీద శతఘ్నులు పేలుతున్నాయి.

ఆ లెవల్లో జరిగేవన్నీ పకడ్బందీగా జరుగుతాయి... ఈ బక్క పలుచని అమాయకుడిలా దొరికిపోతారా? ఊహు... వాళ్ళను దొంగ అన్నవాళ్ళే దొంగలు, దేశ ద్రోహులు...

ఆ సంఘటన చూస్తుంటే తమ కోపాన్నంతా జనం ఆ ఒక్కడి మీదే తీర్చుకుంటున్నారా! అని పిస్తున్నది.

ఏ ఆఫీసర్ భార్యో... బ్రా లాంటి స్లీవ్‌లెస్ బ్లౌజ్ వేసుకొని ఖరీదైన పలుచని చీర కట్టుకుంది. విలాసంగా మంచొని కూల్‌డ్రింక్స్ 'రంగు నీళ్లు' తాగుతోంది. దాదాపు నాలుగు రూపాయలు ఆ రంగు నీళ్లకు! ఉత్పత్తి ఖర్చు మాత్రం నలభై పైసలకు అటూ ఇటు!

గ్రీన్ లైట్ వెలిగింది.

బస్సు సంగీత్ మలుపు దాటి కీస్ హైస్కూల్ రోడ్ మీదుగా వెళ్తోంది.

పెంచిన కొత్త ఛార్జీలు బస్సు గోడల మీద భయంకరంగా కనిపిస్తున్నా

అటువంటి విషయాల్లో రైళ్ళేలు మాత్రం వెనుకంజ వేస్తాయా!

వెనకట ఉగాది వస్తున్నదంటె ఎంత ఉత్సాహమో... సంబరమో...

రాను రాను ఆ సంబరాలు తగ్గుతున్నాయి. ఆ ఉత్సాహమూ సన్నగిల్లుతోంది.

పండుగ ముస్తాబులు లేనవై అటు గుమ్మాలు కళలు తప్పుతున్నాయి. ఇటు మొహాలు వెలవెలబోతున్నాయి.

ఉగాదితో పాటు బడ్జెట్ కూడా దిగుతుంది జనం గుండెల మీదికి...

ధరలు భగ భగ మండిపోతాయి!

అసలు బడ్జెట్ అంటే ఏమిటి? జేబుల్ని నేర్పుగా కొట్టేసే పథకం!

ఆ సెగలో పేదవాడి బతుకు మరీ భారమై... పొగచూరి మధ్యతరగతి నలిగి నలిగి...

ఆ కోపమంతా ఆ బక్క పలుచని అతని మీద చూపిస్తున్నారా ఏం?;?;

"పోలీస్ స్టేషన్ వొచ్చింది..." ఉత్సాహంగా అరిచింది నా పక్కన కూర్చున్న కళ్ళజోడు అమ్మాయి.

"డ్రైవర్ బస్ రోకో..."

"రోకో... రోకో..."

"వాన్ని గట్టిగా పట్టుకోండ్లి..."

అతనికి పారిపోయే ఉద్దేశం ఏ కోశాన లేనట్లుంది. ఆత్మహత్య కంటే జైలు నయం కదా అన్నట్లుంది అతని ధోరణి...

బస్సు ఆగింది.

గింజుకోకుండా అతడు తనను లాక్కుపోయే వారి వెంట పోలీస్ స్టేషన్‌కు నడుస్తున్నాడు.

అతడు ప్రతిఘటించడం లేదని మామూలుగా పట్టుకున్నారేమో... అంతలో....

రెప్పపాటులో ఆ సంఘటన మరో మలుపు తిరిగింది...

అతడు తప్పించుకొని రివ్వున పక్కకు దూసుకుపోయాడు.

అయితే అక్కణ్నుంచి పారిపోవడానికి అతడా పని చేయలేదు.

అదుపు తప్పిన ఒక ట్రక్కు కాస్సేపట్లో ఓ పంటిదాన్ని పొట్టన పెట్టుకునేదే...

పుస్తకాల సంచి మోస్తూ రోడ్డు దాటబోతున్నది.

అమాంతం ఆ అమ్మాయిని పక్కకు లాగి అతడు కిందపడిపోయాడు.

అతని కాళ్ళ మీది నుంచి ట్రక్కు వెళ్ళిపోయింది.

రక్తం మడుగు... గిలగిలా కొట్టుకుంటున్నాడు.

అతణ్ణి పోలీస్ స్టేషన్‌కు లాక్కుపోబోయిన జనమంతా అతని చుట్టే వున్నారు.

వారి కళ్లు చెమ్మగిల్లాయి.

అటుగా వెళ్తున్న ఒక వ్యానును అందరూ కలిపి ఆపారు.

ఇంకా శ్వాస ఆడుతున్న అతణ్ణి వ్యానులోకి చేర్చి ఆసుపత్రికి తీసుకుపోయారు...

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్